ప్రజాశక్తి
గురువారం 22 డిసెంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు



పిహెచ్‌సిలో రక్తహీనత పరీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కిల్లోగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐటిడిఏ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణీలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని కె.కరుణ మాట్లాడుతూ. గర్భిణులు ఆకుకూరలు, గుడ్లు, పాలతో పాటు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆశ కార్యర్తలు రక్తహీనత మాత్రలను ఇవ్వడంతో పాటు ప్రతినెల పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రసవ సమయంలో దగ్గరలో ఉన్న ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

స్ఫూర్తిదాయకంగా సిఐటియు జిల్లా మహాసభ

పోరాటాలతోనే కార్మిక హక్కులకు రక్షణ: అప్పలనర్స
మహిళా కార్మికులపై వేధింపులు : బి.బేబి రాణి

ప్రజాశక్తి పాడేరు :

అల్లూరి సీతారామరాజు జిల్లా సిఐటియు ప్రథమ మహాసభలు దిగ్విజయంగా ముగిశాయి. మంగళ, బుధవారాల్లో పాడేరులో మోదకొండమ్మ కళ్యాణ మండపంలో జరిగిన ఈ మహాసభ ప్రతినిధులకు స్ఫూర్తినిచ్చింది. రాబోయే కాలంలో చేపట్టబోయే పోరాటాలకు మహాసభ దిశానిర్దేశం చేసింది. గత పోరాటానుభవాలను పంచుకున్నారు. కర్తవ్యాలు రూపొందించుకున్నారు.

మహాసభ ముగింపు సందర్భంగా బుధవారం సిఐటియు జిల్లా ప్రతినిధుల సభలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతోనే విశాల కార్మిక ఉద్యమం నిర్మించడానికి వేదిక కానుందని, పోరాటాలతోనే కార్మిక హక్కులు రక్షణకు సాధ్యమౌతుందని అన్నారు. కార్మికుల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి కార్మిక హక్కులను హరించే కుట్రపూరితమైన వైఖరిపై విశాలమైన ఉద్యమ వేదికకు కార్మికవర్గానికి సమీకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం కల్పించిన వాక్కు స్వాతంత్ర్యాన్ని కూడా కాలరాస్తూ మనువాద విధానాన్ని ప్రజల్లో బలవంతంగా రుద్దాలని కేంద్ర ప్రభుత్వ ప్రణాళికను విచ్ఛిన్నం చేయగల శక్తి, సామర్థ్యం కార్మిక వర్గానికే ఉందని అన్నారు. జిల్లాలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రిజర్వేషన్ కల్పించే జిఓ నెం 3ను రద్దు చేసి మూడేళ్ల కావస్తున్నా పునరుద్ధరించకపోవడంతో యువతీ యువకులు అసాంఘిక శక్తులుగా మారుతున్నారన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను రక్షించుకోవడం ద్వారా సామాజిక న్యాయం సాధన సాధ్యమని, ప్రైవేట్ రంగ పరిశ్రమల్లో కూడా రిజర్వేషన్లు అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.
హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరిట గిరిజన అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్‌కు అప్పగించే కేంద్ర, ప్రభుత్వాల గిరిజన వ్యతిరేక విధానాలపై కూడా గిరిజనుల్లో చైతన్యం తీసుకురావాలని ప్రతినిధులను కోరారు. ప్రజల్లో పెరుగుతున్న అశాంతిని దారి మళ్ళించడానికి లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మత విద్వేషాలు, కుల వైషమ్యాలు రెచ్చగొట్టి కార్మిక పోరాటాన్ని విచ్ఛిన్నం చేయాలనే పాలకవర్గాల నైజాన్ని అర్థం చేసుకోవాలని అన్నారు. కార్మిక, ప్రజా పోరాటాలపై నిర్బంధం పెరిగిందని వాటిని ఎదుర్కొని ఉద్యమం నిర్మించడం ద్వారానే సంఘం బలోపేతానికి దోహదం చేస్తుందన్నారు.


సిఐటియు మహా సభలో మాట్లాడుతున్న అప్పలనర్స

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.బేబి రాణి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోయినా యాప్‌ల పేరుతో అంగన్వాడీ, ఆశా, మిడ్డేమీల్స్ కార్మికులపై అధికారుల వేధింపులు అధికమయ్యాయని తెలిపారు. శ్రామిక మహిళలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్డ్ రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26వేల వేతనం ప్రభుత్వం చెల్లించాలని, ఆ దిశగా కార్మిక ఉద్యమం నిర్మించాలని కోరారు.
గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజన సమస్యలపై నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమానికి కార్మికవర్గం మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిల్లో ప్రభుదాస్ సౌహార్ద సందేశాన్ని ఇచ్చారు. ఈ మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు నివేదిక ప్రవేశపెట్టగా 11 మండలాల నుండి మరియు 16 రంగాల నుండి కార్యదర్శి నివేదికపై చర్చించి నివేదిక ఇచ్చారు. అధ్యక్షవర్గంగా బోనంగి చిన్నయ్యపడాల్, శెట్టి నాగరాజు, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వ్యహరించగా మహాసభలో 19 రకాల సమస్యలపై తీర్మానాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు పి. బాలదేవ్ ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, సిఐటియు జిల్లా నాయకులు మంగమ్మ, బుజ్జిబాబు, పోతురాజు, సుందరరావు, గిరిజన సంఘం నాయకులు సోమేలి చిట్టిబాబు, సత్యనారాయణ, జిల్లా నలుమూలల నుండి హాజరైన 200 మంది ప్రతినిధులు పాల్గొని మహాసభను విజయవంతం చేశారు.


హాజరైన ప్రతినిధులు

మహాసభల తీర్మానాలు

స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి. రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలి. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ టైం స్కేల్ కంటింజెంట్ డైలీవేజ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. రెగ్యులరేషన్ లోపు సమాన పనికి సమాన వేతనం, సౌకర్యాలు కల్పించాలి. ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. కార్మికులకు కనీస వేతనం నెలకు 26 వేలు చెల్లించాలి. జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలి. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. శ్రామిక మహిళలకు భద్రత కల్పించాలి. కాఫీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి. విస్తత పోరాటాల ద్వారా విశాఖ ఉక్కును కాపాడుకోవాలి. జిల్లాలో గంజాయి వంటి మాదకద్రవ్యాలను నివారించాలి. వలసలు నివారించాలి. వ్యవసాయ కార్మికులకు గ్రామాల్లోనే పనులు కల్పించి కనీస వేతనం ఇవ్వాలి.


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం

రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విధంగా ట్యాబులు అందజేయడం జరిగిందని రంపచోడవరం శాసనసభ్యులు నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని ఇర్లపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ట్యాబ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విధంగా ఈ ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎంవివి సత్యనారాయణ దొర, ఎటిడబ్ల్యూ రామ తులసి, ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ప్రజా ప్రతినిధులు కర్రి పాపారాయుడు, జల్లేపల్లి రామన్న దొర, ఎ.సత్యనారాయణ రెడ్డి, పండా రామకృష్ణ, ఎంపీటీసీ తుర్రం వెంకటేశ్వర్లు దొర తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు 150 ట్యాబులు బుధవారం పంపిణీ చేశారు. జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబ్జు, ఎంపీపీ సార్ల లలిత కుమారి, ఎంపీడీవో వీర కిషోర్ వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ జాకబ్, వైస్ ఎంపీపీ లక్కుండ రవికుమార్, వైస్ సర్పంచ్ బి వీరబాబు, పాఠశాల చైర్మన్ వీకా రామన్న దొర, ప్రధాన ఉపాధ్యాయురాలు ఈశ్వరి దేవి, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ఏకలవ్య పాఠశాలలో పిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య పాఠశాలను ఐటిడిఎ సూరజ్ గనూరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి పెడుతున్న మెనూపై ఆరా తీశారు. పాఠశాలలో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టకపోవడంతో పరిశీలించి ప్రహరి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వారి వెంట రాజవొమ్మంగి డిప్యూటీ తాహసిల్దార్ అల్లి సత్యనారాయణ, ఎంపీడీవో కె బాపన్న దొర, పాఠశాల ప్రిన్సిపల్ కష్ణారావు తదితరులున్నారు.


మోటారు బోరు స్విచ్ ఆన్ చేస్తున్న సర్పంచ్ పూనెం సరోజిని

ఇంటింటికి కుళాయిల బోరు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి సుద్దగుడెం గిరిజన గ్రామంలో రూ.2 లక్షలతో కొత్తగా ఏర్పాటు ఇంటింటికి కుళాయిల బోరును స్థానిక సర్పంచ్ సరోజిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని, అందుకే ప్రజలకు ఏలాంటి తాగునీరు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, పంచాయతీ సెక్రెటరీ శివ ప్రసాద్, సచివాలయ ఇంజనీర్ కుంజా తరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

గిరిజన విలేకరుల సంఘం మద్దతు

ప్రజాశక్తి -పాడేరు: స్థానిక ఐటీడీఏ వద్ద విద్యార్థి, కార్మిక, మహిళా గిరిజన సంఘాల వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడవరోజు కొనసా గాయి. మూడవరోజు దీక్షలలో స్థానిక గిరిజన విలేకరుల సంఘం మద్దతునిచ్చి రిలే దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు . ఈ సందర్భంగా సంఘం నాయకులు సూర్యారావు, రమణ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో తల్లిదండ్రులు, విద్యార్థి, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను అనుమతి లేదని జారీ చేసిన కాంతిలాల్ దండే సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి మూడు నెలలకు డిప్యూటీ వార్డెన్‌లను నియమించి ఐటీడీఏ మూడు శాతం కమీషన్లను మింగేస్తుందని ఆరోపించారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, కో కన్వీనర్ కిలో ప్రభుదాస్‌లు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతం అభివృద్ధికి కృషి చేయవలసిన పాడేరు ఐటీడీఏ పీవో గిరిజన ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులపై వేధింపులకు పాల్పడం సరికాదని, తక్షణమే సరెండర్ చేయాలన్నారు. గిరిజన విద్యార్థుల వరస మరణాల పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని. బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక కో కన్వీనర్లు ముచ్చాళ లక్ష్మణరావు, చిన్నారావు, చిట్టిబాబు, లతా కుమారి, గిరిజన విలేకరుల సంఘం సభ్యులు మోహన్, సునీల్, రామచంద్రరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



మద్దతు తెలుపుతున్న విలేకర్ల సంఘం నేతలు

మహాదేవ్‌కు సిపిఎం నేతల సంతాపం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ దండబాడు గ్రామంలో కామ్రేడ్ చిట్టాం నాయక్ మహాదేవ్ సంతాప సభనుబుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు, పంచాయతీ సర్పంచ్ చిన్నబాబులు మాట్లాడుతూ, కష్టజీవుల సమస్యల పరిష్కారానికి మహాదేవ్ ఎన్నో పోరాటాలు చేసారన్నారు.సిపిఎంలో వివిధ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కృషి చేశాడన్నారు.విద్యా, వైద్యం అందరికీ ఉచితంగా అందించాలని ఎన్నో పోరాటాల్లో పాల్గొని ప్రజలు తరపున నిలబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ గురుమూర్తి, ప్రసాద్, కేశవ్, బాబురావు, నాని బాబు పాల్గొన్నారు.

నిలిచిన ఆర్‌టిసి బస్

ప్రయాణికులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-అనంతగిరి: కాలం చెల్లిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులతో ప్రయాణీకులు ఇక్కట్లు పడుతున్నారు. అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డులో విశాఖచ విజయనగరం జిల్లా ఎస్.కోట ఆర్టీసీ డిపోల నుండి ప్రయాణిస్తున్న కాలం చెల్లిన బస్సులతో ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయి. ఇంజిన్ కండిషన్ లేక బస్సులు అరకు, అనంతగిరి ఘాట్ రోడ్డులో ఎక్కడపడితే అక్కడ నిలిచి పోతున్నాయి. దీంతో అరకు, అనంతగిరి నుండి మైదాన ప్రాంతాలైన ఎస్.కోట, విజయనగరం, వైజాగ్ వెళ్లే ప్రయాణకులకు గంటల తరబడి ఆలస్యం అవుతుంది. బుధవారం అనంతగిరి ఘాట్ రోడ్డు ములియగుడ కాంప్లెక్స్ వద్ద అరకు నుండి వైజాకు వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు నిలిచి పోవడంతో ప్రయణికులు ఇబ్బందులకు గురయ్యారు. మరో బస్సు రాక కోసం గంట పైగా వేసి చూడాల్సిన పరిస్థితి ప్రయణికులకు నెలకొంది.

పెట్రోల్ బంకులు పున:ప్రారంభం

ప్రజాశక్తి - అడ్డతీగల

మండల కేంద్రంలో పెట్రోల్ బంకు బుధవారం పున:ప్రారంభమైంది. గత కొన్ని సంవత్సరాలుగా జిసిసి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ బంకు సంవత్సర కాలంగా నిలిచిపోయింది. దీంతో గిరిజన సహకార సంస్థ వారు ఇండియన్ పెట్రోల్ బంక్ వారికి లీజుకు ఇవ్వడంతో వారు సుమారు రూ.2.20 కోట్లతో పునరుద్ధరించారు. ఈ పెట్రోల్ బంకును జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతి రాణి, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాతిరాణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో పెట్రోల్, డీజిల్‌ను అధిక ధరలకు అమ్ముతున్నారని తెలియడంతో వెంటనే అడ్డతీగల, రంపచోడవరంలో పెట్రోల్ బంకులను పునరుద్ధరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిసిసి జనరల్ మేనేజర్ జె.యుస్టస్, డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వరరావు, అడ్డతీగల మేనేజర్ చంద్రశేఖర రావు, మారేడుమిల్లి మేనేజర్ రాజా రెడ్డి, గోడౌన్ సూపరింటెండెంట్ బాబురావు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని ఇర్లపల్లి జిసిసి ద్వారా నిర్వహిస్తున్న పెట్రోల్, డీజిల్ బంకును జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, రంపచోడవరం శాసన సభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మి
బుధవారం పున:ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శబంధం శ్రీదేవి, జడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కె.బాలకృష్ణ, పండ కుమారి, లక్ష్మి, సర్పంచులు చదల శ్రీదేవి, కుంజం వెంకటలక్ష్మి, ప్రజా ప్రతినిధులు కర్రి పాపారాయుడు, జల్లేపల్లి రామన్న దొర, జిసిసి సీనియర్ మేనేజర్లు ఎంఎన్,రాజారెడ్డి. విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి

చిత్రకొండ వరకు మెయిల్ బస్సు పొడిగింపు

ప్రజాశక్తి -సీలేరు

నర్సీపట్నం నుంచి జికె.వీధి మండలం సీలేరు వరకు కొన్ని సంవత్సరాలు నడుపుతున్న ప్రైవేటు మెయిల్ బస్సు సర్వీసును బుధవారం నుంచి ఆంధ్ర ఒడిశా సరిహద్దు చిత్రకొండ వరకు బస్సు యజమాని రాజు పొడిగించారు. దీనిపై సరిహద్దు ప్రాంత ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్సు నర్సీపట్నంలో ప్రతిరోజు తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరి చింతపల్లి మీదగా సీలేరుకు 10.30 గంటలకు చేరుకొని తిరిగి, సీలేరులో 11 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు నర్సీపట్నం చేరేది. ఈ బస్సు నర్సీపట్నం, లంబసింగి, చింతపల్లి, గూడెం, దారకొండ, సీలేరు వరకు ప్రయాణించే వారికి సౌకర్యవంతంగా ఉంది. ఈ బస్సుకు ఒడిశాలోని చిత్రకొండ వరకు రూట్ పర్మిట్ ఉంది. కొన్నాళ్లు పాటు దీనిని ఒడిశా సరిహద్దుకు తిప్పేవారు. చిత్రకొండ కాట్రగెడ్డ, పిల్లి గెడ్డ మీదగా సరిహద్దులోని ప్రధాని రహదారి వరకు బీటీ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో తరుచూ మరమ్మతులకు గురి అవుతుండడంతో కొన్నాళ్ల క్రితం ఈ సర్వీసును సీలేరుకు కుదించారు. అయితే ఈ రహదారి గుండా మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి ఏపీ జెన్కో అధికారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జెన్కో అధికారులు రహదారి సౌకర్యంపై తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో కాట్రగెడ్డ వరకు ఆంధ్ర ప్రభుత్వం, అక్కడ నుంచి చిత్ర కొండ వరకు ఒడిశా ప్రభుత్వం రహదారి నిర్మాణం చేసింది. దీంతో సరిహద్దు ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రైవేట్ మెయిల్ బస్సు సర్వీస్‌ను యజమాని రాజు చిత్ర కొండ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ బస్సు నర్సీపట్నంలో ఉదయం 5 గంటలకు బయలు దేరి సీలేరు మీదుగా చిత్రకొండ వెళ్లి, తిరిగి సాయంత్రం 5 గంటలకు నర్సీపట్నం చేరకుంటుంది.



చిత్ర కొండ వెళ్తున్న ఎస్ఆర్‌సిఎంటి ప్రైవేట్ బస్ సర్వీసు

వెదురు కార్మికులకు కూలి డబ్బులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని చదలవాడ గ్రామ పంచాయతీ పరిధిలో తులసిపాక, సిరసనపల్లి గ్రామస్తులకు చెందిన వెదురు నరికిన కార్మికులకు తక్షణమే కూలి డబ్బులు చెల్లించాలని కోరుతూ సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యాన బుధవారం ఐటిడిఎ గ్రీవెన్స్‌లో ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు, గిరిజన సంఘం నాయకులు పోడియం లక్ష్మణ్, సీసం సురేష్ మాట్లాడుతూ గతేడాది కొండపైన ఉన్న వెదురును కటింగు, లాట్టింగ్ కొరకు స్థానిక గిరిజనులు ఫారెస్ట్ అధికారులతో ఒప్పందం చేసుకొని చేసుకొని వెదురును నరికినట్లు చెప్పారు. అలా నరికిన వెదురును అమ్ముకొని సొమ్ము చేసుకున్న ఫారెస్టు అధికారులు కూలీలకు నేటికీ డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీనికి స్పందించిన ఏవో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లి డబ్బులు ఇప్పించే మార్గం చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెదురు కార్మికులు ఇరకం బుజ్జి, ఇరకం సుబ్బయ్య, వంజం ముత్తయ్య, సాదుల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న సిఐటియు, గిరిజన సంఘం నాయకులు



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

విద్యాభివృద్ధికి సిఎం జగన్ కృషి : ఎమ్మెల్యే పాల్గుణ

ప్రజాశక్తి - అరకులోయ: విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యను ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారని, దీనిలో భాగంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని కంఠబౌంసుగుడ సిహెచ్ స్కూల్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో పేద విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించి మంచి భవిష్యత్తును పొందేందుకు వీలుగా ట్యాబ్‌లు పంపిణీ చేసే ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అరకులోయ మండలంలో 14 పాఠశాలకు సంబంధించి 891 ట్యాబ్ లు అవసరం ఉండగా, ఇందులో 180 ట్యాబులను పంపిణీ చేశారు. పెదబయలు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మాట్లాడుతూ, ట్యాబ్‌లను దుర్వినియోగం చేసుకోకుండా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నాణ్యతతో కూడిన ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే సమాజాభివృద్ధి చెందుతుందని, జీవితంలో కూడా స్థిరపడవచ్చు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు డిడి కొండలరావు, ఎంఈఓ భారతీరత్నం, సిహెచ్ స్కూల్ హెచ్‌ఎం దయానిధి, ఎంపీపీ ఉషారాణి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శోభ సోమేశ్వరి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కేకును కట్ చేశారు.



క్రిస్మస్ పండుగలో చిన్నారుల నత్యం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు తలారిసింగిలోని గౌతమీ పబ్లిక్ స్కూల్‌లో క్రిస్మస్ పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన యుసివైఎ ఫౌండర్ చీఫ్ రీమలి జాన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి సోదర భావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పాస్టర్ జి.తిమోతి వాక్యా సందేశాన్ని అందించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (యుసివైఎ) సలహాదారులు బి.ఎలీషారావు, కె.సత్యారావు, ఉపాధ్యక్షులు డి.రవికుమార్, పి.థామస్, పాఠశాల ప్రిన్సిపల్ శివ, కరెస్పాండెంట్స్ శ్రీను, మాణిక్యం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ సెలబ్రేషన్ ను అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని కాఫీ హౌస్ లో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జడ్ పి చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నరసింగరావు హాజరయ్యారు. అల్లూరి జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ స్టీఫెన్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. కారుణ్య మినిస్ట్రీస్ డైరెక్టర్ సిహెచ్.దైవకృప, అరకు లూథరెన్ మిషనరీ సంజీవ్ కుమార్, ఫ్రెడ్రిక్ ప్రసంగించారు. పాస్టర్స్ బుచ్చయ్య, రత్నం, బాబురావు, డేవిడ్, యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (యుసివైఎ) ముఖ్య సలహాదారులు బి.ఎలీషారావు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మిక హక్కులకు ఉద్యమించాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ



మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి-పాడేరు:రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ గెలుపునకు ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమ నేతలందరూ కృషి చేయాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ కోరారు. పాడేరులో జరుగుతున్న సిఐటియు మహాసభల్లో బుధవారం ఆమె పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో ఉద్యోగ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం మరిన్ని ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు.పట్టభద్రుల ఓటర్లను చైతన్యం చేయడానికి ఉద్యమ నేతలంతా కృషి చేయాలన్నారు. తమ హక్కుల సాధన కోసం సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గాలపై ఈ ప్రభుత్వాలు ఉక్కు పాదం మోపుతున్నాయని, అడుగడుగునా నిర్బంధాలకు గురి చేస్తున్నాయని ఆమె విమర్శించారు. అధికారంలోకి రాకముందు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తానని, మెరుగైన పిఆర్సి అమలు చేస్తానని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు హామీ లిచ్చి విస్మరించారన్నారు. వీటి కోసం అడుగుతున్న ఉపాధ్యాయుల్ని, ఉద్యోగుల్ని అడుగడుగునా నిర్బంధాలకు ఈ ప్రభుత్వం గురిచేస్తుంది అన్నారు. రాష్ట్రంలో కార్మిక ఉద్యోగ వర్గాల నిరసనలను, ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్న అధికార పార్టీని ఎన్నికల్లో ఓడించి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వానికి ఒక హెచ్చరిక గుణపాఠం అవుతుందన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించడంపై పాలకులకు చిత్తశుద్ధి కరువైందన్నారు. ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచుతూ హక్కుల్ని కాలరాస్తుందని, పదేళ్లు దాటిన కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని తొలగించడానికి కూడా ఈ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.ఉద్యోగ, కార్మిక వర్గాల పట్ల ప్రభుత్వాల తీరుపై మరిన్ని ఐక్య పోరాటాలు సాగించాల్సి ఉంటుందన్నారు. నూతనంగా ఏర్పడిన అల్లూరి జిల్లాలో నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలంటే కుటీర పరిశ్రమలను నెలకొల్పాల్సి ఉందని అన్నారు. ఏజెన్సీలో గిరిజనుల పండిస్తున్న కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం, పిప్పళ్లి తదితర వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు అందుతాయన్నారు. ఉపాధి లేక గిరిజన యువత పట్టణ ప్రాంతాలకు పనుల కోసం వలస వెళుతున్నారని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటు పరం చేసేందుకు పూనుకుంటున్నాయని, విశాఖ ఉక్కు కోసం సుదీర్ఘకాలంగా కార్మికులు పోరాటం సాగిస్తున్నారని తెలిపారు.

ఓటర్ల తొలగింపును జాగ్రత్తగా చేయాలి

ఎలక్టోరల్ అబ్జర్వర్ అహ్మద్ బాబు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అహ్మద్‌బాబు

ప్రజాశక్తి-పాడేరు: ఓటర్ల జాబితా తయారీలో ఓటర్ల తొలగింపు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని, తొలగింపునకు కారణాలు సవివరంగా నమోదు చేయాలని ఎలక్టోరల్ అబ్జర్వర్ అహ్మద్ బాబు ఆదేశించారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన కలెక్టరేటు సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెయ్యి మంది ఓటర్లు మించి ఉన్న పోలింగ్ బూత్‌లను గుర్తించి అదనపు బూత్ ఏర్పాటుకు ప్రతిపాదించాలన్నారు. అసలు క్లెయిమ్ లో లేని బూత్ పరిధిలో సంబంధిత సహాయ ఎలెక్టోరల్ అధికారి మరోసారి పరిశీలించాలని సూచించారు. ఎన్నికల విధులను సీరియస్ గా తీసుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలు తెలుగులో ప్రకటించాలనన్నారు. కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయాలన్నారు. దరఖాస్తులు తిరస్కరించిన కారణము సవివరంగా నమోదు చేసి ఫిర్యాదుల వెబ్ సైట్ లోని పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తు ఫారం 6, 7, 8 లు తప్పనిసరిగా భౌతికంగా ఉండాలని, వాటిని ప్రచురించటానికి గల కారణాలను డాక్యుమెంట్ జత చేయాలని అబ్జర్వర్ ఆదేశించారు. గత సందర్భంలో సూచనలు జారీ చేసినప్పటికీ కొంతమంది సరిగా వేయలేదని ముఖ్యంగా తొలగింపులలో సమగ్రమైన కారణాలు నమోదు చేయ లేనందున హెచ్చరిస్తున్నామని పేర్కొన్నారు. తదుపరి సందర్శనలో చర్యలు ఉంటాయన్నారు. జనవరి ఏడున తుది జాబితా ప్రకటించాల్సి ఉందన్నారు. అనంతరం మినుములూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో అందిస్తున్న పౌర సేవలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పాలు, పోషకాహారం పంపిణీపై ఆరా తీసారు. ఈ సమీక్షా సమావేశంలో సంయుక్త కలక్టర్ (స్వీప్ నోడల్ అధికారి) జె.శివ శ్రీనివాసు, పాడేరు, రంపచోడవరం ఐటిడిఎ అధికారులు శ్రీ రోణంకి గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, పాడేరు, అరకు నియోజకవర్గాల ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సబ్ కలక్టర్ వి.అభిషేక్, రంపచోడవరం ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (జిల్లా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి) బి.దయానిధి, తహసిల్దార్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనంతగిరి:అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన మండలంలోని పెద్దబిడ్డ స్కూల్ కాంప్లెక్స్ పరిధి గుమ్మ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కిల్లో వెంకటరావు కుటుంబ సభ్యులకు అఖిల భారత గిరిజన ఉపాధ్యాయ నేతలు రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ఏం.శేషాద్రి, బి.సింహాచలం నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎల్‌బి. వెంకటరావు, మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి.దేముడు, శెట్టి .రాంబాబు, టి. సుబ్బారావు, డి.సన్యాసిరావు పాల్గొన్నారు.

24న వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి -పాడేరు: ఈనెల 24న నిర్వహించనున్న జాతీయ వినియోగదారులు దినోత్సవం విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన కార్యాలయంలో వినియోగదారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీఎస్ఆర్టీసీ, సివిల్ సప్లై, వైద్యారోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల హక్కులపై పట్టణంలో ర్యాలీ నిర్వహించి వినియోగదారులను చైతన్యవంతం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న నేతలు

జిఓ 52ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పెదబయలు :జిఓ 52 ను రద్దు చేయాలని మండల కేంద్రంలో జెఎ సి అధ్యక్షుడు సిహెచ్ బాలకృష్ణ అధ్వర్యంలో బుధవారం ర్యాలీ చేపట్టారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన కులాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో నివాస ముంటున్న ఆదివాసుల జాబితాలోకి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 52ను, శ్యాముల్ ఆనంద్ కమిషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిఓ రద్దు చేయక పోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్ధిని యువకులంతా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ఆదివాసుల హక్కులను పాలక ప్రభుత్వాలు కాలరాస్తే ప్రాణాలను సహితం లెక్క చేయకుండా ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి వెనకడుగు వేయబోమన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలు చట్టసభల్లో ఈ విశయం పై ఆదివాసుల తరుపున నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న అల్లూరి జిల్లా పాడేరులో జరిగే ఆదివాసీ గర్జనకు తరలి రావాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొట్టడం రాజుబాబు, మండల కన్వీనర్ వి కొండయ్య, తిరుపతిరావు పాల్గొన్నారు.

హుకుంపేట :బోయ, వాల్మీలకు ఎస్టీ జాబితాలో చేర్చకూడదని జేఏసీ జిల్లా కన్వీనర్ కూడా రామన్న దొర డిమాండ్ చేశారు.ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన విధానాలపై జీపు జాత ద్వారా ప్రచారం చేస్తూ బుధవారం హుకుంపేటలో విద్యార్థులతో ఆందోళన చేపట్టారు. అనంతరం తహాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బోయ, వాల్మీకిలను ఎస్టి జాబితాలో చేరిస్తే నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు.ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో భారీ ఎత్తున ఏజెన్సీ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-సీలేరు : జిల్లాలోని బొడ్డగండి పంచాయతీ బచ్చులూరు యుసిఐఎం చర్చిలో బుధవారం పాస్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. జీకే వీధి మండలం సీలేరు యుసిఎం చర్చిలో పాస్టర్ మనసై ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఒకరినొకరు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వన విహారిలో 'పచ్చ తోరణం'



మొక్కలు నాటుతున్న అటవీ సిబ్బంది

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి రేంజ్ అటవీ శాఖ అధికారి బివివి ప్రసాద్ ఆధ్వర్యంలో వన విహారి ప్రాంగణంలో బుధవారం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జి బాలాజీ బాబు, సర్పంచ్ కే జాకోబ్, వై సర్పంచి వీరబాబు, వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వరద నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా నాయకులు రాధ

ప్రజాశక్తి-విఆర్.పురం : వరద బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఐద్వ జిల్లా నాయకులు కుంజా రాధా, ఐ.పద్మ డిమాండ్ చేశారు. కూనవరం మండలం, టేకుల బోరులోని పాయం సీతమ్మ మీటింగ్ హాల్లో ఐద్వా మండల కమిటీ సమావేశం బొజ్జ సుధారాణి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై, ఆగస్టులో వచ్చిన వరదలకు సర్వం కోల్పోయిన కూనవరం మండల నిర్వాసితులకు తక్షణమే రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, ఆరు నెలలుగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులు ఇవ్వాలని, డ్వాక్రా మహిళల అప్పులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుండం బుచ్చమ్మ, బొగ్గ సుబ్బమ్మ, లోహిత, శ్రీ లక్ష్మీ పాల్గొన్నారు.

శ్రీరామగిరిలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'



ఇంటింటా సమస్యలు వివరిస్తున్నటిడిపి నేతలు

ప్రజాశక్తి-విఆర్‌పురం : టిడిపి మండల అధ్యక్షుడు ఆచంట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు ఆధ్వర్యంలో శ్రీరామగిరి ఉప సర్పంచ్ కొడిశల దుర్గారావు, నాలారపు సత్యనారాయణ సమక్షంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగిన తెలుసుకున్నారు. రాష్ట్రానికి రాజధాని అమరావతి కావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు న్యాయం జరగాలన్నా టిడిపి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బురక కన్నారావు, సిద్దు, శేఖర్, రాంబాబు, భాగ్యలక్ష్మి, బొర్రా నాగేంద్ర, సవలం రాజు, బీరక సూర్య ప్రకాష్ రావు, పాయం రామారావు, పెందుర్తి బాలాజీ, అల్లాడి అచ్చిరాజు, రేవు శివ, రంగాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతలపూడిలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, పార్టీ నిధి, సభ్యత్వం వసూలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. గుమ్మా రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ, మండల కార్యదర్శి ఇరవాడ దేముడు, కనకరాజు, మోల్ల నాగరాజు, మాదల సత్యనారాయణ, కుడుముల రాజు, వియ్యపు నానాజీ, దర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైసిపి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు రామాలయం సెంటర్లో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, వైసిపి నాయకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు బలరాం, బుజ్జి, స్వర్ణలత, చిరుపతి, మండి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు సత్తి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్ కొండ జాకబ్, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, కోఆప్షన్ నెంబర్ గురుకు ధర్మరాజు, వైసిపి నాయకులు బొడ్డేటి గంగరాజు, గొర్లె అనిల్ ప్రసాద్ పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని కొండగోకిరి పంచాయితీ గుజ్జుమానుపాకల గ్రామంలో వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, చింతపల్లి ఎఎంసి చైర్ పర్సన్ కొప్పు రాజులమ్మ, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రేగటి ముడిలినాయుడు, వైసిపి నాయకులు గాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్లో రంపచోడవరం యూత్, స్కూల్ పిల్లల సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమం వైసిపి యూత్ కన్వీనర్ రాపాక సుధీర్, రైల్వే బోర్డు చైర్మన్ రామారావు, గవర్నమెంట్ హాస్పటల్ చైర్మన్ కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అరకులోయ:మండల కేంద్రంలో సిఎం జగన్ జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, మల్లేష్ నాయక్ జన్మదిన వేడుకలు నిర్వహించగా, మరోపక్క మాజీ ఎమ్మెల్యే, ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు వర్గీయులు వైసీపీ నేత పాంగి చిన్నారావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ జెడ్పిటిసి సభ్యురాలు శెట్టి రోష్ని, హుకుంపేట మాజీ జెడ్పిటిసి, వైసిపి నాయకురాలు కొర్రా వరకాసులమ్మ, నాయకులు వంతల త్రినాథ్, పరుశురాం, విజయ్ కుమార్, అప్పలరాజు, ప్రకాష్, భాస్కరరావు, పశుసంవర్ధక శాఖ ఏడి అశ్వద్ధామా తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను మండలంలోని రెండు వైసిపి వర్గాలు వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలో ఎంపీపీ శెట్టి. నీలవేణి వర్గం నేతలు సంబరాలు చేశారు. వైసిపి మండల పదవి రేసులో ఉన్న రెగ పోయిన స్వామి వర్గంకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు కాశీపట్నం పంచాయతీ కేంద్రం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

అరకులోయరూరల్: అరకులోయలో వైసిపి నాయకులు పాంగి చిన్నారావు, విజయ్ కుమార్, పాంగి పరశురాం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అరకులోయ జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎస్టీ కమిషన్ సభ్యులు జంపరంగి లిల్లీ, పెదబయలు ఎంపిపి బొండ వరహాలమ్మ మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నర ఏళ్లలో దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు సమర్డి భాస్కరరావు, సర్పంచులు భాస్కరరావు, జంబ్రి, మఠం బంగారమ్మ, మైకం భాగ్యవతి, గల్లెల పూల్ మొత్తి, రేగం రమేష్, మఠం ముత్యాలమ్మ, ఎంపిటిసి పూర్ణారావు, మాజీ జడ్పిటిసి కొర్రా కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట : మండల కేంద్రంలో అధికార పార్టీ శ్రేణులు, సర్పంచులు, ఎంపీటీసీలు సిఎం జన్మదిన వేడుకలు అంతంత మాత్రంగానే నిర్వహించారు. బుధవారం రోజున పార్టీ శ్రేణులు, సర్పంచులు, ఎంపీటీసీలు లేక బోసిపోయింది. మండలంలో వర్గాల కావడంతో ఎవరికి వారికి పొంతన లేకపోవడంతో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించలేదని పలువురు పార్టీ శ్రేణులు తెలిపారు. తోరణాలు, జెండాలు ఏర్పాటు చేయలేదు.



అరకులో కేక్ కట్ చేసి తినిపిస్తున్న వైసిపి మహిళా నేతలు



సీలేరులో...



కొయ్యూరులో...



రంపచోడవరంలో..



మారేడుమిల్లిలో...

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి మారేడుమిల్లి

స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్సిపల్ కిషోర్ బాబు సహకారంతో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని డాక్టర్ సూచించారు. విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సులు, ఆశాలు పాల్గొన్నారు.

జిఓ 52ను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి-సీలేరు

రాష్ట్రంలో బోయ వాల్మీకి, బొంత ఒరియా తెగలను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి ఉద్దేశించిన జిఓ నెంబర్ 52ను, దాని ద్వారా నియమించిన ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు భారత ఆదివాసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు గడుతూ రాంగోపాల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంగోపాల్ మాట్లాడుతూ గిరిజన తెగలు ఆచార వ్యవహారాలతో ఏమాత్రం సంబంధం లేకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వారిని గిరిజన తెగల్లో కలపడం కేవలం రాజకీయ స్వలాభం కోసమేనని ఆయన పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ విధంగా చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బోయ వాల్మీకుల్ని ఎస్‌టి జాబితాలో చేర్చితే గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసినట్టే అవుతుందన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసరాలు



నిత్యావసరాలు, దుప్పట్లు ఇస్తునన నేతలు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల పరిధిలోని రామవరం పంచాయతీ పరిధి అడవి వెంకన్నగూడెం గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇటీవల గ్రామానికి చెందిన పండ సుబ్బయ్య ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆ కుటుంబ దీనస్థితి చూసి ఎంపిపి కారం లక్ష్మి మానవతా దకృథంతో, సుబ్బయ్య కుటుంబానికి నిత్యవసర సరుకులు, బట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సుందరయ్య, కుంజా నాగిరెడ్డి, విఆర్‌ఓ హేమావతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.